క్లుప్తంగా

జాతీయ క్రీడాకారులకు అభినందన



సన్మానం అందుకుంటున్న జాతీయ క్రీడాకారులు

ఒంగోలు: స్థానిక అంజయ్య రోడ్డులోని అగ్నికుల క్షత్రియ సామాజిక భవనంలో క్రీడారంగంలో ప్రతిభ కనబరిచిన అగ్నికుల క్షత్రియ క్రీడాకారులకు అభినందన సన్మాన కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. శ్రీరామ్ హాస్పిటల్స్ అధినేత చాపల వంశీకృష్ణ, ప్రకాశం జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కరరావు, అగ్నికుల క్షత్రియ ఆరామ క్షేత్ర సామాజిక భవనం అధ్యక్షుడు వల్లభని రంగారావు తదితరులు విజేతలను అభినందించారు. వెయ్యాల వెంకటేశ్వర్లు, సిరిగిరి రంగారావు, ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ ఏడీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రీడలకు ఎంపిక



గోపి (ఫైల్)

నాగులుప్పలపాడు: ఉప్పుగుండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి జాతీయ స్థాయి పోల్ వాల్ట్ క్రీడలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ రంగనాయకులు తెలిపారు. కళాశాలకు చెందిన వి.గోపి కర్నూలులో జరిగిన పోల్ వాల్ట్ క్రీడల స్టేట్ మీట్‌లో ప్రథమ స్థానంలో నిలిచి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. ఈ చివరిలో జార్ఖండ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.



పెదకొత్తపల్లి ప్రధాన రహదారి వెంట సైడు కాల్వలో పెరిగిన గడ్డి



చెన్నకేశవస్వామి ఆలయం ఎదురుగా వేసిన చెత్త

పారిశుధ్యమా..అదెక్కడ?

మద్దిపాడు: మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా మారింది. కొత్తగా వచ్చిన పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోక పోవడంతో వీధులన్నీ మురికిమయంగా మారాయి. గ్రామాల్లో పారిశుధ్యం కనుమరుగై మురికి కూపాలుగా మారిపోతున్నాయి. మండలంలోని పెదకొత్తపల్లిలో ప్రధాన వీధుల వెంట పిచ్చి మొక్కలు పెరిగిపోయి అడవిని తలపిస్తున్నాయి. చాలా గ్రామాల్లో సైడు డ్రైన్లు లేక అల్లాడుతుంటే ఉన్న సైడు డ్రైన్లల్లో పూడికతీత, పిచ్చి మొక్కలు తొలగించేందుకు కూడా పెదకొత్తపల్లి గ్రామ కార్యదర్శికి మనసు రాలేదేమోనని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ప్రధానంగా గ్రామంలోని చెత్త తీసుకొచ్చి చెన్నకేశవస్వామి ఆలయానికి కొన్ని మీటర్ల దూరంలోనే వేయడం దారుణం. చెత్తను ఎస్‌డబ్ల్యూపీసీలకు తరలించాల్సి ఉండగా దేవాలయం ముందు పడేయడమేమిటో తెలియని పరిస్థితి. ఇక ప్రధాన వీధిలోని ఎంపీపీ పాఠశాల వెనుక భాగంలో పిచ్చి మొక్కలు పెరిగిపోయి దోమలకు ఆవాసాలుగా మారాయి. ఎంపీపీ పాఠశాలలోనే చివరి గదిలో అంగన్‌వాడీ సెంటర్ కూడా నడుపుతున్నారు. చిన్నారులు దోమలు కుట్టడంతో జ్వరాలబారిన పడే అవకాశాలు మెండుగా ఉన్నాయి. రానున్న మూడు రోజుల్లో వర్షాలు భారీగా కురుస్తాయని వాతావరణ శాఖ చెబుతున్న నేపథ్యంలో దోమలు విపరీతంగా పెరిగి జ్వరాల బారిన పడే అవకాశాలు మెండుగా ఉన్నాయని గ్రామస్తులు పలువురు వాపోతున్నారు. అంజయ్య నగర్‌లోని ఇళ్ల మధ్య వర్షపు నీరు నిలిచి మురుగు పేరుకు పోవడంతో దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయని కాలనీ వాసులు వాపోతున్నారు. వీధిలైట్ల గురించి పట్టించుకునే వారు లేకపోవడంతో పట్టపగలు కూడా అవి వెలుగుతూనే ఉంటాయి. వీధి లైట్లు పోయినచోట మళ్లీ లైట్లు వేయించేందుకు ఇన్‌చార్జి కార్యదర్శికి సమయం లేకపోవడం వింతగా ఉంది. రెండు నెలలుగా గ్రామ కార్యదర్శి లేకపోవడం ఇన్‌చార్జిలుగా ఉన్నవారు పని చేయక పోవడం పెద్ద తలనొప్పిగా మారిందని గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో సమస్యలపై అవగాహన లేకపోవడంతో ఇటువంటి దుస్థితి దాపురించిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఇవే పరిస్థితులు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుధ్య పనులు చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

లింగ నిర్ధారణ నిషేధ చట్టం అమలు చేయాలి



సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: జిల్లాలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం పక్కాగా అమలు చేయాలని అందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. మంగళవారం ప్రకాశంభవనంలో లింగ నిర్ధారణ నిషేధ చట్టం–1994 అమలుపై జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని.. అటువంటి పరీక్షలు చేసిన వారికి, చేయించుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. డెకాయ్ ఆపరేషన్‌లు, ఆకస్మిక తనిఖీలను ఎన్‌జీవో ప్రతినిధుల సమన్వయంతో ముమ్మరం చేయాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ సురేష్‌కుమార్, నాగార్జున, ప్రభాకర్, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలూ ముఖ్యమే!



క్రీడాకారుల నుంచి గౌరవవందనం స్వీకరిస్తున్న జేసీ

ఒంగోలు సిటీ: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ అన్నారు. మంగళవారం ఒంగోలులోని కేంద్రీయ విద్యాలయంలో జరిగిన 17వ వార్షిక క్రీడా వేడుకల్లో జేసీ గోపాలకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో క్రీడలు, నాయకత్వం, జవాబుదారీతనం, సహనం, ఆత్మవిశ్వాసం, జట్టు కృషి వంటి జీవన నైపుణ్యాలు నేర్పించడంలో ఎంతగానో దోహదపడతాయన్నారు. విద్యార్థులు క్రీడా స్ఫూర్తి అలవర్చుకోవాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాబోధనతో పాటు క్రీడా రంగానికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఉపాధ్యాయులు.. విద్యార్థులను ఉత్తమ నైపుణ్యం ఉన్న క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని కోరారు. ముందుగా క్రీడా పతావిష్కరణ చేశారు. ఫ్లాగ్ మార్చ్ తిలకించి క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. పోటీలకు హాజరైన బాలబాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన క్రీడా విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. క్రీడల్లో విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సురేష్‌కుమార్, యూబీఐ మేనేజర్ ప్రసాద్‌సాహు, స్టెప్ మేనేజర్ శ్రీమన్నారాయణ, ప్రిన్సిపాల్ మనీష్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ శివరాం, రిటైర్డు ప్రిన్సిపాల్ సూర్యప్రకాశరావు, కేంద్రీయ విద్యాలయం అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మేస్త్రీలను విధుల్లోకి తీసుకోవాలి

ఒంగోలు సబర్బన్: మేస్త్రీలుగా పనిచేస్తున్న కార్మికులను విధుల్లో తీసుకోవాలని ఒంగోలు నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగానికి చెందిన మేస్త్రీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని మస్టర్ పాయింట్ల వద్ద మంగళవారం మేస్త్రీలు, కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. సీఐటీయూ నగర కార్యదర్శి టీ మహేష్ మాట్లాడుతూ స్థానిక ఒంగోలు నగరపాలక సంస్థలో 15 సంవత్సరాల నుంచి పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న మేస్త్రీలను విధుల్లో కొనసాగించాలని డిమాండ్ చేశారు. వేతనాలతో కూడిన మస్టర్ ఇవ్వాలని ఒంగోలు నగరంలోని ఐదు డివిజన్లలో నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు. ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక రాజకీయ నాయకులు, మున్సిపల్ అధికారులు కార్మికులపై రాజకీయ కక్షతో వేధింపులు చేస్తూ నోటిమాట ద్వారా సెప్టెంబర్ 22వ తేదీ నుంచి నేటి వరకు కార్మికులకు మస్టర్ వేయకుండా వేతనాలతో బిల్లులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నేటికీ పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న కోవిడ్ కార్మికులకి ఐదు నెలలు పూర్తి కావస్తున్నా వేతనాల బకాయిలు ఉన్నాయని, అలాగే ఆప్కాస్ లో పనిచేస్తున్న కార్మికులకి గత ఫిబ్రవరి నెల మెడికల్ అలవెన్స్, 12వ తేదీన అక్టోబర్ నెల వేతనం కార్మికులకి అకౌంట్లో పడలేదని చెప్పారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం మేయర్ జీ.సుజాతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులు కే సామ్రాజ్యం, యు రత్నకుమారి, నగర అధ్యక్ష కార్యదర్శులు జీ నరసింహ, టీ విజయమ్మ, యూనియన్ జిల్లా కార్యదర్శి కొన్నుపాటి శ్రీనివాసరావు, యూనియన్ నాయకులు ఆర్ శ్రీనివాసరావు, కే వెంకటేశ్వర్లు, ఎం బాబు, కే ఆదినారాయణ, సీహెచ్ వెంకటేశ్వర్లు, గోపి తదితరులు పాల్గొన్నారు.

15లోపు అభ్యంతరాలుంటే తెలపండి

ఒంగోలు సిటీ: జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర పోస్టులకు సంబంధించి మెరిట్‌లిస్ట్ ను సమగ్రశిక్ష ఒంగోలు కార్యాలయం నోటీస్‌బోర్డులో ఉంచారని, వీటికి సంబంధించిన అభ్యంతరాలను ఈ నెల 15వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు తెలియజేయాలని డీఈఓ అత్తోట కిరణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొవిజనల్ మెరిట్ కమ్ రోస్టర్ ప్రకారం 1:3 సబ్జెక్టు వారీగా లిస్టులను చైర్మన్ ఆదేశాల మేరకు prakaram.ap.gov.in వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు.

సముద్రంలో పడి మత్స్యకారుడు మృతి

కొత్తపట్నం: సముద్రంలో వేటాడుతుండగా ప్రమాదుశావత్తు యువకుడు మృతి చెందాడు. చిన్నపట్టపు పాలెం గ్రామానికి చెందిన ప్రళయకావేరి యానాది (50) మంగళవారం మధ్యాహ్నం సముద్రంలో ఉండగా.. వల కాళ్లకు చుట్టుకుని కింద పడి ఊపిరాడక మృతి చెందాడు. కొద్దిసేపటికీ శవమై ఒడ్డుకు కొట్టుచ్చాడు. ఎస్సై సుధాకర్‌బాబు వివరాలు సేకరించారు.

ఎన్‌ఎస్‌ఎస్‌తో నాయకత్వ లక్షణాలు పెంపు

● ఎన్‌ఎస్‌ఎస్ రాష్ట్ర రీజినల్ కోఆర్డినేటర్ ఎం.రామకృష్ణ



ఏకేయూలో మొక్కలు నాటుతున్న వీసీ మూర్తి

ఒంగోలు సిటీ: జాతీయ సేవా పథకం ద్వారా సమాజంలోని ప్రతి ఒక్కరిలో సేవా దృక్పథంతో పాటు నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని ఎన్‌ఎస్‌ఎస్ రాష్ట్ర రీజినల్ కోఆర్డినేటర్ ఎం.రామకృష్ణ అన్నారు. ఏకేయూలోని సమావేశ హాలులో మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లకు నిర్వహించిన ×మై భారత్ పోర్టల్ అవేర్నెస్× శిక్షణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎం.రామకృష్ణ మాట్లాడారు. నేటి కంప్యూటర్ కాలంలో సమాజాభివృద్ధిలో భాగంగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి యువత ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాల ద్వారా చేయి చేయి కలిపి ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులకు సంబంధించి యూసీ లు సమర్పిస్తే మళ్లీ నిధులు మంజూరవుతాయన్నారు. కార్యక్రమానికి ఏకేయూ ఉపకులపతి ప్రొఫెసర్ డి.వి.ఆర్. మూర్తి అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి కొత్తగా ఏర్పడిన ఆంధ్ర కేసరి యూనివర్సిటీలో ప్రస్తుతం 58 ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. నూతన యూనిట్లు మంజూరు కావాలంటే వలంటీర్లను గుర్తించి సమాజసేవలో భాగస్వాములను చేసేందుకు కళాశాలల ప్రోగ్రాం అధికారులు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని సూచించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో సమాజ సేవ కోసం క్రమశిక్షణతో కలిసిమెలిసి పనిచేసే విద్యార్థులు అందుబాటులో ఉన్నారన్నారు. అనంతరం ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ గా పనిచేస్తున్న డాక్టర్ మండే హర్షప్రీతం దేవ్‌కుమార్ సేవలను కొనియాడారు. యూనివర్సిటీ ప్రాంగణంలో మొక్కల పెంపకం, గ్రీనరీ ఏర్పాటు వంటి కార్యక్రమాలు ఎన్‌ఎస్‌ఎస్ ద్వారా చురుగ్గా సాగుతున్నాయన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.హరనాథ్, డాక్టర్ దివ్యతేజో మూర్తి, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజమోహన్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ నిర్మలామణి లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు, సీడీసీ డీన్ ప్రొఫెసర్ జి.సోమశేఖర, డాక్టర్ అంచుల భారతీ, డాక్టర్ పిల్లి వెంకటరావు, డాక్టర్ ఆర్.శ్రీనివాస్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు



వీధి కుక్కల నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన సమీక్షలో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వర రావు

ఒంగోలు సబర్బన్: వీధి కుక్కల నియంత్రణకు ఒంగోలు నగర పాలక సంస్థ చర్యలు చేపట్టేందుకు కసరత్తు చేపట్టింది. ఈ మేరకు నగర కమిషనర్ డాక్టర్ కోడూరి వెంకటేశ్వర రావు మంగళవారం నగర పాలక సంస్థ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అధికారులతో పాటు కుక్కల ప్రేమికులు, మానిటరింగ్ కమిటీ, ఎన్‌జీఓలతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వీధి కుక్కల నియంత్రణలో భాగంగా యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం మామిడిపాలెం కంపోస్ట్ యార్డ్‌లో వీధికుక్కల కోసం ఆపరేషన్ థియేటర్, ఆపరేషన్ చేసిన తరువాత వాటికి కల్పించాల్సిన వసతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూడా సమీక్షించామన్నారు. మానిటరింగ్ కమిటీ సూచనల మేరకు ప్రత్యేక ఏర్పాట్లు కూడా చేశామని తెలిపారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు త్వరితగతిన చేపట్టే విధంగా అధికారులను ఆదేశించామని చెప్పారు. సమీక్షలో ఒంగోలు నగర పాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

చెక్ బౌన్స్ కేసులో జైలు శిక్ష

ఒంగోలు: చెక్ బౌన్స్ కేసులో నిందితుడు ఏ.శ్రీనివాస్‌కు ఏడాదిన్నర జైలు శిక్ష విధిస్తూ ఒంగోలు ఎక్సైజ్ కోర్టు మేజిస్ట్రేట్ ఎస్.కోమలవల్లి మంగళవారం తీర్పునిచ్చారు. ఒంగోలుకు చెందిన షేక్ బిస్మిల్లా వద్ద శ్రీనివాస్ రూ. 5 లక్షల అప్పు తీసుకున్నాడు. ఆ బాకీ నిమిత్తం రూ. 6 లక్షలకు బ్యాంకు చెక్కు ఇవ్వగా అది బౌన్స్ అయినట్లు కోర్టులో కేసు దాఖలైంది. నేరం నిరూపణ అయినట్లు పేర్కొంటూ నిందితుడు శ్రీనివాస్‌కు న్యాయమూర్తి ఏడాదిన్నర జైలుశిక్ష రూ. 6లక్షలు జరిమానా విధించారు.

హోరా హోరీగా బ్యాడ్మింటన్ పోటీలు

ఒంగోలు: స్థానిక లార్డ్ కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమీలో ప్రకాశం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న అండర్ 11 బాల బాలికల బ్యాడ్మింటన్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. ఈనెల 10 వ తేదీ నుంచి 13 వరకు నిర్వహిస్తున్న పోటీలకు రాష్ట్రంలోని 13 జిల్లాల బ్యాడ్మింటన్ క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సత్తా చాటారు. మంగళవారం నిర్వహించిన పోటీలలో అండర్ 11 బాలుర సింగిల్స్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో సూఫీయన్ పై కే మోజీస్ విజయం సాధించారు. మోక్షజ్ఞ పై జి.రామ్ సుశాంత్ గెలిచారు. జె కార్తీక్ పై ఏ.హరీష్ వెంకట సాయి విజయం సాధించారు. ఎస్.కే ఆఫ్రస్ ప్రత్యర్థి గౌతమ్‌పై విజయం సాధించారు. అండర్ 11 బాలికల క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో హేమన్య కిరీటిపై ఆర్.ఎమ్.చౌదరి గెలుపొందారు. ప్రియాంక పై కీయ గెలిచారు. కే.అద్య పై శ్రీ ఆద్య రెడ్డి విజయం సాధించారు. నిత్య పై ఎస్.కే రబియా గెలుపొందారు.

డబుల్స్ విభాగంలో:

బాలుర డబుల్స్ లో హర్షిత వెంకట సాయి, త్రిషాల్ రెడ్డి జంటపై పై రామ్ రంజిత్, మోహిత్ విజయం సాధించారు. కార్తేకేయ, సాయి దీక్షిత్ పై పి.బి.జి.గౌతమ్, సాత్విక్ రెడ్డి జట్టు విజయం సాధించింది. నాగ సాయి భరత్, యస్విన్ పై బదరీ నికేష్, మోక్షజ్ఞ గెలిచారు. ఆదిత్య, జయంత్ పై జి.రామ్ శుశాంత్, కార్తీక్ సూర్య రాయ్ విజయం సాధించారు. వివాన్ నెహల్, ప్రణవ్ పై హావిష్ రెడ్డి, ఇషాక్ రెడ్డి గెలుపొందారు. మోజీస్, కేతన్ పై ముకుంద్, సుఫియాన్ గెలిచారు. ప్రణవ్ సాయి, యు.మణికంఠ పై జె.కార్తీక్, నిహాల్ విజయం సాధించారు. సత్విన్ ఇషాన్, అరుష్ వర్మ పై ఎస్ కే.అఫ్రాన్, ఎస్ కే.యాసిర్ గెలుపొందారు. బాలికల డబుల్స్ క్వార్టర్ మ్యాచ్‌లో అతిథి, జయ శ్రీ పై కే ఆద్య, ఎస్.కే రబియా విజయం సాధించారు. శ్రావ్య, అక్షర పై మధులిక, మనస్వీ విజయాన్ని అందుకున్నారు. అనన్య, మహీన్ చీహెన్ పై సమన్విత, సాహితీ, హసినీ గెలుపొందారు. ఆర్ ఎం.చౌదరి, నిత్య పై ప్రియాంక, శ్రీ ప్రియ విజయం సాధించారు. క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో గెలిచిన విజేతలకు బుధవారం సెమీ ఫైనల్స్, ఫైనల్స్ పోటీలు నిర్వహిస్తామని లార్డ్ కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమీ ఫౌండర్ చైర్మన్ అద్దంకి మురళీ కృష్ణ తెలిపారు.



గాంధీ రోడ్డులో జలమయం అయిన దృశ్యం



లాయర్ పేట కూడలిలో ఇలా..

ఒంగోలు నగరం రోజు రోజుకూ అధ్వానంగా మారుతోంది. ముఖ్యంగా వర్షాలు పడితే మురుగు నీరంతా రోడ్లపైకి వస్తూ వాహనదారులకు, పాదచారులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సంక్షిప్తంగా

పోలీసు శాఖకు ఏఆర్ వెన్నెముక

ఒంగోలు టౌన్: పోలీసు వ్యవస్థకు ఏఆర్ సిబ్బంది వెన్నెముక వంటి వారని, ఎక్కడైనా లా అండ్ ఆర్డర్ సమస్య తలెత్తినప్పుడు ఏఆర్ సిబ్బంది పాత్ర చాలా కీలకమని ఎస్పీ ఏఆర్ దామోదర్ చెప్పారు. పోలీసు సంక్షేమంలో భాగంగా మంగళవారం పోలీసు కళ్యాణ మండపంలో దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్యాజువల్ లీవు, బదిలీలు, టీఏలు, అలవెన్సులు, ఏఆర్ స్పెషల్ పార్టీ పోలీసుల బందోబస్తులు, జీపీఎఫ్ లోన్లు, మెడికల్ బిల్లులు, సినియార్టీ లిస్టు, పదోన్నతుల గురించి ఏఆర్ సిబ్బంది తమ సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకొని వచ్చారు. సిబ్బంది సమస్యలను విన్న ఎస్పీ.. వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. పోలీసుల సాదకబాధకాలను తెలుసుకునేందుకే దర్బార్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బందోబస్తు, ఎస్కార్ట్ విధుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. వృత్తిపరంగా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొనిరావాలని చెప్పారు. తొలుత సోమవారం మృతి చెందిన హెడ్ కానిస్టేబుళ్లు చలపతిరావు, కోమటినేని విజయకృష్ణ, ఆత్మహత్య చేసుకొన్న మార్కాపురం టౌన్ కానిస్టేబుల్ జి. మస్తాన్ ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, ఆర్ఐలు రమణా రెడ్డి, సీతారామిరెడ్డి, రమేష్ కృష్ణన్ పాల్గొన్నారు.

లైంగిక దాడి చేసిన టీచర్‌ను అరెస్ట్ చేయాలి

ఒంగోలు వన్‌టౌన్: కారుమంచిలో దళిత విద్యార్థినిపై లైంగిక దాడి చేసి అగ్రకుల టీచర్‌ను వెంటనే అరెస్టు చేయాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు మంగళవారం డిమాండ్ చేశారు. స్థానిక సంఘ కార్యాలయంలో మాట్లాడుతూ లైంగిక దాడికి పాల్పడిన చెన్నకేశవులను అరెస్టు చేయకుడా పోలీసులు టీడీపీ నాయకుల కనుసన్నల్లో నడుస్తున్నారన్నారు. తమ కులానికి చెందిన టీచర్‌ను తప్పించి, దళిత వర్గానికి చెందిన టీచర్ పేరును తెరపైకి తీసుకువస్తున్నారన్నారు. సింగరాయకొండ సీఐ, టంగుటూరు ఎస్సైలు కేసు నమోదు చేయకుండా రిమ్స్ సఖీ కేంద్రానికి బాధిత చిన్నారిని తీసుకువచ్చారన్నారు. దళిత, వైఎస్సార్ సీపీ నాయకులు తీవ్ర ఆందోళన అనంతరం పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారన్నారు. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ కేసుగా మార్చాలని డిమాండ్ చేశారు.

పొగాకేతర పంటలపై శిక్షణ

సంతనూతలపాడు: మండలంలోని బొడ్డువారిపాలెం, పి.తక్కెళ్లపాడు, ఎం.వేములపాడు గ్రామాల్లో పొగాకు పంటకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు కోసం రైతులకు మంగళవారం గ్రామస్థాయిలో శిక్షణ ఇచ్చారు. మండల వ్యవసాయాధికారి పి.పావని రైతులతో మాట్లాడుతూ పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా శనగ, కంది, మినుము, పెసర, అలసంద, సజ్జ, జొన్న, మొక్కజొన్న, కొర్ర పంటలు సాగు చేస్తే తక్కువ పెట్టుబడితో అధిక లాభం పొందవచ్చని, అంతేకాకుండా పొగాకు మార్కెట్ ధరలు స్థిరంగా లేకపోవడంతో రైతులు నష్టపోయే అవకాశం ఉందని, ప్రతి సంవత్సరం పొగాకు పంటను అధిక విస్తీర్ణంలో సాగు చేస్తే కూలీలు ఖర్చు, అధిక కౌలు ఖర్చు, సాగు ఖర్చు పెరగడమే కాకుండా వాతావరణ కలుషితం, మానవాళి ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉన్న పంట కావడం వల్ల ఈ పంట సాగు విస్తీర్ణం తగ్గించాలని కోరారు. కార్యక్రమం అనంతరం బొడ్డువారిపాలెం, ఎం.వేములపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రాయితీపై వచ్చిన శనగ విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. వ్యవసాయ విస్తరణాధికారి కేవీ సుబ్బారెడ్డి, బొడ్డువారిపాలెం, పి.తక్కెళ్లపాడు, ఎం.వేములపాడు గ్రామాల గ్రామ వ్యవసాయ సహాయకులు డి.సుప్రజ, షేక్ అబ్జల్, పి.జయకృష్ణ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయినిగా మజ్నూబీబీ

మద్దిపాడు: మండలంలోని బసవన్నపాలెంలో హిందీ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న డాక్టర్ షేక్ మజ్నూబీబీ రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైంది. నేషనల్ ఎడ్యుకేషన్ డే సందర్భంగా మంగళవారం తాడేపల్లిలో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి అవార్డులు ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా అందించారు. షేక్ మజ్నూబీబీ కూడా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈమె గతంలో పలుమార్లు జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయనిగా ఎంపికయ్యారు. పలు స్వచ్ఛంద సంస్థలతో ఆమె కలిసి పని చేశారు. ఆమె రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయినిగా అవార్డు అందుకోవడంపై మండలంలోని యూనియన్‌ల నాయకులు, ఉపాధ్యాయులు, ఎంఈఓలు ఎంవీఆర్ ఆంజనేయులు, మెడబలిమి శ్రీనివాసరావులు బసవన్నపాలెం పాఠశాల సహోద్యోగులు అభినందనలు తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ఒంగోలు టౌన్: ఊరి బయట పాడుబడిన భవనంలో ఒక వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరముల ప్రకారం.. కొత్తపట్నం మండలంలోని మోటుమాల గ్రామనికి చెందిన మల్లవరపు శ్రీను గత రెండేళ్లుగా పాతపాడు గ్రామ శివారులో ఎండ్రకాయలు పట్టకొని అమ్ముకుంటూ జీవిస్తున్నాడు. భార్యతో విభేదాల కారణంగా పది సంవత్సరాలుగా ఒంటరిగా నివసిస్తున్నాడు. ఈ క్రమంలో పాతపాడు ఊరి బయట రొయ్యల సాగు కోసం నిర్మించిన కాలువ పక్కన పాడు భవనంలో మంగళవారం అతడి మృతదేహం కనిపించింది. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీల్‌చైర్‌కు రూ.32 వేల అందజేత

ఒంగోలు సిటీ: సూర్యశ్రీట్రస్ట్ కార్యదర్శి ఎస్కే సర్దార్ బాష ఆధ్వర్యంలో దాతలు ప్రవాసభారతీయులు శివాజి రెడ్డి, నిర్మల దంపతుల సహకారంతో దివ్యాంగుడైన మణిదీప్ కు రూ.32 వేల విలువ చేసే వీల్ చైర్ కోసం చెక్కును మంగళవారం ట్రస్ట్ కార్యదర్శి సర్దార్ బాష అందజేశారు. చిన్నగంజాం మండలం, గోనపూడి గ్రామానికి చెందిన భీమవరపు మాధవి కుమారుడు మణిదీప్ దివ్యాంగుడు. ఇతను నడవ లేడు. వేలిముద్రలు పడకపోవడం వల్ల పింఛన్ రాక నానా అవస్థలు పడుతున్నారు. సమాచారం తెలుసుకున్న ట్రస్ట్ కార్యదర్శి సర్దార్ బాష మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా దివ్యాంగుని తల్లి మాధవికి ప్రతి నెలా రూ.5 వేలు పింఛన్ అందజేస్తున్నట్లుగా తెలిపారు. ఈ సందర్భంగా మాధవి దాతలకు ట్రస్ట్ కార్యదర్శి సర్దార్ బాషకు, సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

ఈతముక్కల (కొత్తపట్నం): మండలంలో ఈతముక్కల ఎస్‌యూవీఆర్ అండ్ ఎస్‌ఆర్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో పనిచేస్తున్న ఫిజిక్స్ లెక్చరర్ ఆర్‌వీ కృష్ణయ్య, కెమిస్ట్రీ లెక్చరర్‌గా పనిచేస్తున్న ఎస్. మాధవి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అవార్డును ప్రశంస పత్రం, జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో అభినందన సభ ఏర్పాటు చేసి సత్కరించారు. కాలేజీ ప్రిన్సిపాల్ వి.ఏసుప్రసాద్ రావు మాట్లాడుతూ ఉత్తమ అవార్డు తీసుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

బసవన్నపాలెం హెల్త్ వెల్‌నెస్ సెంటర్ పరిశీలన

మద్దిపాడు: మండలంలోని బసవన్నపాలెం హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను యాప్ ద్వారా ఎన్‌క్వాస్ నేషనల్ క్వాలిటీ ఏష్యూరెన్స్ స్టాండర్డ్ కమిటీ సభ్యులు డాక్టర్ ప్రేమాన్షు పాండ్య, డాక్టర్ రుక్మిణీలు మంగళవారం పరిశీలించారు. వెల్‌నెస్ సెంటర్ ముందు భాగం నుంచి సెంటర్ పరిసరాలు మొదలుకుని వెల్‌నెస్ సెంటర్‌లోని ప్రతి గదిని పరిశీలించి ఆయా గదుల్లో ఏర్పాటు చేసిన పలు స్టాల్స్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులు మొత్తం యాప్ ద్వారానే పరిశీలించారు. అనంతరం వెల్‌నెస్ సెంటర్‌లో రోగులకు, బాలింతకు అందించే సేవలపై పలు ప్రశ్నలు వేసి సమాధానాలు తీసుకున్నారు. సెంటర్‌లో మందులు అందుబాటులో ఉన్నాయా లేవా అన్న విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వెల్‌నెస్ సెంటర్‌కు వచ్చే రోగులను సిబ్బంది పని తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఎన్‌క్వాస్ కో ఆర్డినేటర్ ఎన్. కృష్ణప్రసాద్ నిర్వహించగా ఆస్పత్రి డాక్టర్లు శ్రావణ్ ఆనందమోహన్, వినీల జగదీష్, సీహెచ్‌ఓ రజితకుమారి, హెచ్‌వీ నాగరాజి, సూపర్‌వైజర్ బాలకోటయ్య, ఎంఎల్‌హెచ్‌పీ జెస్సీ రోజ్‌పాల్, ఏఎస్‌ఎం మాధవి, ఎంఎల్‌హెచ్ పీలు మాధురీలత, రమ్యజ్యోతి, అఖిల, పూజిత, దరియా సురేష్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

సంతనూతలపాడు: స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్సై అజయ్‌బాబు ఆధ్వర్యంలో మంగళవారం వాహనాలు తనిఖీ చేశారు. అదే విధంగా డ్రంక్ అండ్ డ్రైవ్ కూడా చేపట్టారు. వాహనదారులకు లైసెన్సులు, వాహన పత్రాలు, హెల్మెట్ ధరించని వారిపై కేసులు నమోదు చేశారు. ప్రతి ఒక్క వాహనదారుడు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండి, హెల్మెట్ ధరించాలని, లేకుంటే తగు కేసులు నమోదు చేసి జరిమానాలు విధించనున్నట్లు ఎస్సై అజయ్ బాబు హెచ్చరించారు. ఈ సందర్భంగా డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహించారు. ఏఎస్సైలు సత్యనారాయణమూర్తి, వెంకట్రావు, ఇతర పోలీస్ సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు.